

సాక్షి ప్రకాశం

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



పోరాట యోధులు

దేశ స్వాతంత్య్రం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన యోధులెందరో ప్రకాశం జిల్లాకు చెందిన వారున్నారు. - IIలో..



మసీదుకు నిప్పుపెట్టిన దుండగులు

గుర్తుతెలియని దుండగులు జామియా మసీదుకు నిప్పు పెట్టిన ఘటన త్రిపురాంతకం మండలం దూపాడులో జరిగింది. - IIలో..

గరిష్టం/కనిష్టం
31 /25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సిటీ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా పురస్కారాలు అందించనున్నట్లు డీఈఓ కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన జిల్లాలోని ఐదు పాఠశాలలను వీటికి ఎంపిక చేస్తామన్నారు. 2025 విద్యా సంవత్సరంలో స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ధ్రువీకరణ నకళ్లతో ఒంగోలులోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్.జీ.ఎఫ్) కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ లోపల సంప్రదించాలని తెలిపారు. నకళ్లపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీ సంతకాలు ఉండాలన్నారు.

448 మంది ఉద్యోగులకు ప్రశంస పత్రాలు


ఒంగోలు సబర్బన్: ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకుగాను 448 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించేందుకు జిల్లా అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ఈ మేరకు గురువారం ప్రశంస పత్రాలు అందుకోబోతున్న అధికారుల జాబితాను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ప్రకటించారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఆగస్టు 15న ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి హాజరుకానున్నారు. ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రజా ప్రతినిధులకు జిల్లా యంత్రాంగం ఆహ్వానం పంపింది. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులు మొదలుకొని కింది స్థాయి సిబ్బంది వరకు సేవలను గుర్తించి వారికి ప్రశంస పత్రాలు అందించనున్నారు. వారిలో 23 మంది జిల్లా అధికారులు ఉన్నారు. వారితో పాటు రెవెన్యూ విభాగంలోని 77 మందికి, పోలీస్ విభాగంలోని 36 మందికి ప్రశంస పత్రాలు ఇచ్చేందుకు జాబితాలు సిద్ధం చేశారు. మిగతా అన్ని ప్రభుత్వ విభాగాల్లోని అధికారులకు, సిబ్బందికి కలిపి మొత్తం 345 మందికి కూడా ప్రశంస పత్రాలు అందించనున్నారు. వారితో పాటు స్వాతంత్య్ర సమర యోధుల వారసులను కూడా ఈ సందర్భంగా సన్మానించనున్నారు.

సినీనటుడు గిరిబాబుకు నాగభైరవ పురస్కారం

ఒంగోలు మెట్రో: సినీనటుడు, నిర్మాత, దర్శకుడు గిరిబాబుకు ఈ నెల 17వ తేదీ నాగభైరవ ఆత్మీయ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు నాగభైరవ సాహిత్యపీఠం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సభలో ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డికి, కోనేరు కల్పనకు నాగభైరవ సాహిత్య పురస్కారాన్ని, కె.కె.ఎల్ స్వామికి నాగభైరవ కళా పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీనటుడు రఘుబాబు పాల్గొంటారు. డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షత వహించే ఈ కార్యక్రమాన్ని డాక్టర్ నూనె అంకమ్మరావు నిర్వహిస్తారు. కళా సాహిత్యాభిమానులు అందరూ ఈ సభలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

కాలయాపన చేసి.. అరకొర బస్సులేసి!

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం పెట్టిన ఆంక్షలపై మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేవలం కొన్ని సర్వీసులకే ఉచిత ప్రయాణాన్ని పరిమితం చేయడం, తగినన్ని బస్సులు కేటాయించకపోవడం, డిపోల్లో అరకొర వసతులతో అమలు చేయకముందే పథకాన్ని నిరుగారుస్తున్నారని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. మరోవైపు తమ ఉపాధి దెబ్బతింటుందని, ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఆటోవాలాలు డిమాండ్ చేస్తున్నారు.



- నేటి సాయంత్రం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం
- కొన్ని సర్వీసులకే ఉచిత ప్రయాణం పరిమితం
- 11,27,398 మంది మహిళలకు కేవలం 325 బస్సుల ఏర్పాటు
- ఐదు బస్సు డిపోల్లోనూ అరకొర వసతులే
- ఉచిత బస్సు పథకం వలన ఆర్టీసీకి ఏడాదికి రూ.50 నుంచి రూ.60 కోట్ల నష్టం
- ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేయకపోతే పరిస్థితేంటన్నది జవాబు లేని ప్రశ్న
- ఆటోవాలాలకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయని రాష్ట్ర ప్రభుత్వం

ఒంగోలు టౌన్:

గత సార్వత్రిక ఎన్నికల సమయంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని కూటమి నాయకులు ఊరువాడా తిరిగి ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తుంది. కానీ ఉచిత బస్సు ప్రయాణం ఊసెత్తకుండా కాలయాపన చేశారు. ఉచిత బస్సు పథకం అమలు చేయడానికి కమిటీ అధ్యయనం చేస్తుందంటూ సాకులు చెబుతూ వచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల్లో తిరుగుతుంటే వస్తున్న ఆదరణను చూశాక చెమటలు పట్టిన కూటమి పాలకులకు ఇష్టంలేకపోయినా ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయడానికి నిర్ణయం తీసుకొంది.

మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలను ఏ విధంగా అయితే అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్నారో అదేవిధంగా ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కూడా అమలు చేయడానికి పన్నాగాలు పన్నారు. అందుకే ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లు కాకుండా కేవలం 5 రకాల బస్సు సర్వీసుల్లో మాత్రమే ఉచితంగా ప్రయాణం చేసేలా ఉత్తర్వులు ఇచ్చారు. ఆధ్యాత్మిక కేంద్రాలకు వెళ్లే అవకాశం లేకుండా ఘాట్ రోడ్డులో ప్రయాణించే బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించలేదు. దాంతో అమలు చేయకముందే ఈ పథకాన్ని నీరుగారుస్తున్నారని **మహిళా** సంఘాలు మండిపడుతున్నాయి.

11.27 లక్షల మందికి 325 బస్సులు:

జిల్లాలో మొత్తం 11,27,398 మంది మహిళలున్నారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం జిల్లాలోని 38 మండలాల ప్రజలకు గాను కేవలం 325 బస్సులను మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. ఒక్కో బస్సులో 50 నుంచి 60 మందికి మాత్రమే సిటింగ్ ఉంటుంది. నిలబడి ప్రయాణం **చేయడానికి** అనుమతిస్తే మరో 50 మందికి **అవకాశం ఉం**టుంది. అంటే ఒక్కో బస్సులో **కేవలం 110 నుంచి** 120 మంది మాత్రమే ప్రయాణం చేయొచ్చు. జిల్లాలో ప్రస్తుతం రోజుకు 1.50 లక్షల మంది ప్రయాణం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో ఇప్పటి వరకు 40 శాతం మహిళలు ఉంటారని అంచనా.

ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ అంచనాల ప్రకారమే 70 శాతానికి పైగా మహిళా ప్రయాణికులు పెరగవచ్చని చెబుతున్నారు. ఆ లెక్కన చూసినా రోజుకు 1.05 లక్షల మంది మహిళలు ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. ఇంతమంది మహిళలు ప్రయాణం చేయడానికి కేవలం 325 బస్సులు **ఎలా** సరిపోతాయో **ప్రభుత్వమే** చెప్పాలి.

ఆధ్యాత్మిక ప్రాంతాలకు ఉచితం లేనట్లే...

రాష్ట్రంలోని గుంటూరు, విజయవాడ, ఏలూరు తదితర ప్రాంతాల నుంచి **శ్రీశైలం వెళ్లే ప్రయాణికులు తప్పనిసరిగా** జిల్లా నుంచి మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. విజయవాడ, గుంటూరు ప్రయాణికులు మార్కాపురం వచ్చి వయా దోర్నాల ఘాట్ మీదుగా శ్రీశైలం వెళ్లాలి. అయితే ఘాట్ రోడ్డులో ప్రయాణాలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని అనుమతించడంలేదు. దీంతో శ్రీశైలం వెళ్లాలనుకున్న భక్తులకు టికెట్ చెల్లించి వెళ్లాల్సి వస్తుంది. జిల్లాలో బ్రహ్మంగారి మఠం, భైరవకోన, మాలకొండ, శింగరకొండ, సింగరాయకొండలోని దేవాలయాలకు వెళ్లాలంటే ఉచిత బస్సు సౌకర్యం లేకుండా పోతుంది. మాలకొండ, భైరవకోన, శింగరకొండలకు బస్సు సౌకర్యం లేదు. కనుక ఉచిత బస్సు పథకం వర్తించే అవకాశం లేదు. ప్రతి శనివారం మాలకొండకు మహిళా భక్తులు విపరీతంగా వస్తుంటారు. అయినా ఉచిత బస్సు సౌకర్యం ఉండదు కనుక టికెట్ పెట్టుకొని వెళ్లక తప్పదు. కొత్తపట్నం బీచ్‌కు కూడా బస్సు సౌకర్యం లేదు. కొత్తపట్నం వరకు బస్సులో వెళ్లి అక్కడ నుంచి బీచ్‌కు ఆటోల్లో వెళ్లాలి. రామాయపట్నం సంగతి కూడా ఇంతే. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి ఒంగోలు వచ్చి తిరుపతి పుణ్యక్షేత్రానికి వెళుతుంటారు. తిరుమల ఘాట్ రోడ్డుకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలకు ఉచిత బస్సు సౌకర్యం ఎందుకు కల్పించడంలేదో పాలకులు జవాబు చెప్పాలని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు.

బస్సు డిపోల్లో సౌకర్యాలు నిల్...

జిల్లాలో మొత్తం ఐదు బస్సు డిపోలు ఉన్నాయి. ఒంగోలు, పొదిలి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి బస్సు డిపోల్లో సౌకర్యాలు లేవు. మార్కాపురం ఆర్టీసీ డిపో దాదాపుగా శిథిలావస్థకు చేరుకుంది. గిద్దలూరు డిపో కూడా అధ్వానంగా తయారైంది. రాష్ట్రంలో మొత్తం 129 బస్సు డిపోలు ఉండగా వాటిలో చివరి రెండు స్థానాల్లో మార్కాపురం, గిద్దలూరు ఆర్టీసీ డిపోలు ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పొదిలి డిపోలో నిలబడడానికే స్థలం ఉండదు. కనిగిరి డిపో పరిస్థితి దయనీయంగా ఉంది. కనీసం మరుగుదొడ్డి సౌకర్యాలు లేవు. మంచినీటి వసతి లేదు. భారీ సంఖ్యలో మహిళలు తరలివస్తే వెయింటింగ్ గదులు లేవు. కూర్చొనేందుకు కుర్చీలు కూడా లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్టీసీ బస్సు డిపోల్లో సౌకర్యాలు మెరుగుపరచకుండా నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు అరకొర సౌకర్యాలతో ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. ప్రయాణికుల అవస్థలను గాలికి వదిలేయడం పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనమని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఆర్టీసీ బస్సు డిపోల్లో ఇప్పటికే దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి. ఉచిత బస్సు సౌకర్యం కోసం ఎక్కువ సంఖ్యలో మహిళలు తరలివస్తే దొంగలకు అడ్డే ఉండదు. ఒంగోలు ఆర్టీసీ డిపోలో ఉన్న ఔట్ పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఒకరిద్దరు హోంగార్డులతో నెట్టుకొస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే ఇలా ఉంటే మిగతా ప్రాంతాల్లోని ఆర్టీసీ డిపోల్లో ప్రయాణికుల రక్షణ ఎలా ఉంటుందో ఊహించడం కష్టం.

మూడు రకాల బస్సు సర్వీసులకే ఉచితం

జిల్లాలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులకు మాత్రమే ఉచిత బస్సు సౌకర్యం వర్తిస్తుంది. అంటే దాదాపుగా దూర ప్రాంతాలకు ఉచితం లేనట్టేనని చెప్పవచ్చు. జిల్లా నుంచి నెల్లూరు జిల్లా **కావలి, కందుకూరు,** పల్నాడు జిల్లా వినుకొండ వరకు పల్లెవెలుగు **బస్సులు నడు**స్తున్నాయి. అయితే ఒంగోలు నుంచి గుం**టూరు, విజ**యవాడకు ప్రయాణాలు చేసే వాళ్లే ఎక్కువ**గా ఉం**టారు. వారికి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నప్ప**టికీ** అందులో నాన్ స్టాప్ బస్సులకు ఉచి**త** సౌకర్యం కల్పించడం లేదు కను**క** టికెట్ కొనుక్కొని ప్రయాణించాల్సి ఉంటుంది.

ఆటోవాల ఉపాధి సంగతేంటి...

జిల్లాలో 20 వేల మందికి పైగా ఆటోవాలాలు ఉన్నారు. ఒక్క ఒంగోలు నగరంలోనే 5 వేల మంది ఆటోలపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇప్పుడు ఉచిత బస్సు పథకం ప్రారంభం కానుండడంతో తమ ఉపాధి ఎక్కడ దెబ్బతింటుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఆటోవాలాలకు ఏడాదికి రూ.10 వేలు ఇచ్చి ఆదుకున్నారని గుర్తు చేస్తున్నారు. అదే విధంగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా వాహన మిత్ర ద్వారా ఏడాదికి రూ.25 వేల సహాయాన్ని అందించాలని కోరుతున్నారు. లేకపోతే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే బీఎన్ఎస్ చట్టాన్ని సవరణ చేయాలని, మోటారు వాహన చట్టాన్ని సవరణ చేసి జరిమానాలను తగ్గించాలని కోరుతున్నారు. ఆటోవాల జీవనోపాధి దెబ్బతినకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

కూటమి మోసాలపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పుల్లలచెరువు:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు నిలదీయాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మండలంలోని మల్లాపాలెం గ్రామంలో గురువారం సర్పంచ్ రవణారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇది మంచి ప్రభుత్వం కాదని, ముంచే ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ అంటూ హామీలిచ్చారని వాటిలో ఏదీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. నేడు రాష్ట్రంలో కక్ష పూరిత రాజకీయాలు నడుస్తున్నాయని, లేనిపోని ఆరోపణలు చేసి కార్యకర్తలపై కేసులు పెట్టడమే పనిగా టీడీపీ వారు పెట్టుకున్నారని అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను, అక్రమాలను ప్రజలు గమనించాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం వలన ఒక్కో కుటుంబానికి కలిగిన నష్టాన్ని వివరించారు. ముందుగా ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు గ్రామంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ కార్యదర్శి వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్.రాములు, వైపాలెం మండల కన్వీనర్ ముసలారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబుల్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, సర్పంచ్‌లు టి.సత్యనారాయణరెడ్డి, ఎ.కోటిరెడ్డి, జ్యోతి, బాలునాయక్, వెంకటేశ్వర నాయక్, మాజీ సర్పంచ్‌లు రవణారెడ్డి, డి.కోటిరెడ్డి, నాయకులు ఆవుల చెంచురెడ్డి, బ్రహ్మానందరెడ్డి, లక్ష్మానాయక్, యూత్ అధ్యక్షుడు దినేష్‌యాదవ్, హరినాయక్, నాసర్‌రెడ్డి, ఖాసింవలి, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, మహిళా నాయకులు రవణమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, నాయకులు

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జనరల్ సెక్రటరీగా పాకనాటి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగంలో జిల్లాకు చెందిన ఇద్దరిని నియమించారు. యువజన విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా సంతనూతలపాడుకు చెందిన పాకనాటి మహానందిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా మార్కాపురానికి చెందిన గాయం శ్రీనివాసరెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టారు.

తిరంగా..ఘనంగా




మార్కాపురంలో వెయ్యి మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన

మార్కాపురం: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలో దీక్షా యూత్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తిరంగా ర్యాలీలో భాగంగా వెయ్యి మీటర్ల జాతీయ జెండా ప్రదర్శనను సబ్‌కలెక్టర్ వెంకట సహదిత్ త్రివినాగ్ సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభించారు. యువతలో దేశభక్తి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ కోర్టుసెంటరు, కంభం సెంటరు, పాత బస్టాండు మీదుగా సాగింది. మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, తహశీల్దార్ చిరంజీవి, సీఐ పీ సుబ్బారావు, సొసైటీ ప్రతినిధి సాయి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు పుట్టినిల్లు ప్రకాశం జిల్లా. దేశ స్వాతంత్య్రం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయులు ఎందరో. బ్రిటీష్ పాలకుల తూటాలకు ఎదురొడ్డి నిలిచి ప్రజలను చైతన్యవంతులను చేస్తూ తెల్లవారి గుండెల్లో వణుకు పుట్టించారు. పౌరుషానికి పెట్టింది పేరైన ప్రకాశం జిల్లాలో సాగిన ఉద్యమాలు స్వాతంత్య్ర పోరాటంలో దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఎందరో పోరాట యోధుల త్యాగాల ఫలితమే నేడు మనం పీలుస్తున్న స్వేచ్ఛా వాయువులు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆ మహనీయుల త్యాగాలపై సాక్షి కథనం

కంభం/కనిగిరి/మార్కాపురం



పోరాటయోధులు

ఉద్యమ కెరటం కందుల ఓబులరెడ్డి



కందుల ఓబులరెడ్డి (ఫైల్)

కంభం మండలం లింగాపురం గ్రామానికి చెందిన కందుల ఓబులరెడ్డి 1910లో నాగిరెడ్డి, చెన్నమ్మలకు జన్మించారు. బాలగంగాధర తిలక్, గాంధీ ఉపన్యాసాలకు ఆకర్షితుడైన ఆయన 1930–33 లలో ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లారు. స్వరాజ్య ఉద్యమంలో భాగంగా ఖద్దరు ధరించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు రెండేళ్లు జైలుశిక్ష అనుభవించారు. ఎన్జీ రంగా అనుచరుడైన ఆయన 1934లో నిడుబ్రోలులో రంగా ప్రారంభించిన రైతాంగ విద్యాలయానికి ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 1936లో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా, 1946–51లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా పనిచేశారు. అనంతరం 1957లో మార్కాపురం శాసనసభకు ఎన్నికయ్యారు. 1963–64లో ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్‌గా, 1964–71 మధ్యలో అగ్రికల్చర్ యూనివర్శిటీ వ్యవస్థాపక అధ్యక్షునిగా పనిచేశారు. 1972లో యర్రగొండపాలెం నుంచి శాసనసభకు, 1978లో కంభం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి శాసనసభకు ఎన్నికై నీటి పారుదల శాఖా మంత్రిగా, 1982–83 లో ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన వ్యవసాయ రంగానికి చేసిన సేవను ప్రభుత్వం గుర్తించి గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టును ఓబులరెడ్డికి అంకితం చేసి ఆయన పేరు పెట్టారు.

గర్జించిన వీరుడు



సామాన్య ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించిన దరిశి చెంచయ్య చిన్న నాటి నుంచే బ్రిటీష్ నిరంకుశ పాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభించారు. 1905లో జరిగిన వందేమాతర ఉద్యమం, ఆతర్వాత జరిగిన స్వదేశీ ఉద్యమాలు చెంచయ్య ఆకర్షితులను చేశాయి. బాల గంగాధర్ తిలక్ ఇచ్చిన స్వదేశీ ఉద్యమానికి మద్దతుగా చెంచయ్య ఒంగోలులో విద్యార్థులతో చేనేత మగ్గాలపై దుస్తులు నేయించి ధరింప చేశారు. 1912లో అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్శిటీలో వ్యవసాయ శాస్త్ర విభాగంలో చేరారు. అక్కడ భారత విప్లవకారులు లాలా హరదయాళ్, జితేంద్రనాథ్ లహరీ పరిచయమై వారి ప్రసంగాలకు ఆకర్షితులై వారితో కలిసి అమెరికా, కెనడా దేశాల్లోని పంజాబీ సిక్కులు, వ్యవసాయ కార్మికులను సమీకరించి 1913లో గదర్ పార్టీని స్థాపించారు. అప్పట్లో దేశభక్తి భావజాలంతో గదర్ అనే పత్రికను కూడా ఆయన ప్రచురించారు. భారతదేశానికి ఓడలో ఆయుధాలు తెస్తూ ఓ నమ్మక ద్రోహి సమాచారంతో బ్యాంకాక్‌లో బ్రిటీష్ పాలకులకు చిక్కారు. దరిశి చెంచయ్యను లాహోర్, మద్రాస్, బెంగాల్, కలకత్తా, రంగూన్ జైళ్లల్లో నాలుగేళ్లు, తమిళనాడు రాష్ట్ర వెళ్లూరు జైల్లో మరో నాలుగేళ్లు ఉంచారు. సాంఘిక దురాచాలకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు చేశారు. ఆ క్రమంలో తన సామాజిక నుంచి వెలివేశారు. దరిశి చెంచయ్య సుభద్రమ్మ అనే మహిళను కులాంతర వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచారు. పరిపూర్ణ అనే గిరిజన బాలికను పెంచుకున్నారు. స్త్రీ విద్య, హరిజనోద్యమం, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. జన్మస్థలమైన కనిగిరిలో పేదల పక్షాన చెంచయ్య పోరాటాలు చేశారు. కనిగిరికి ఒకటిన్నర కిలోమీటరు దూరంలో టకారిపాలెం సమీపంలో చుట్టుబావి(తాగునీటి బావి) ఉంది. కరువుతో కనీసం గుక్కెడు నీరు దొరక్క పేద మహిళలు తాగునీటి కోసం చుట్టుబావి వద్దకు వెళితే కొంత మంది అగ్రవర్ణాలు తహసీల్దార్‌తో కలిసి వారిని అడ్డుకున్నారు. అప్పట్లో ఆర్యవైశ్యులైన దరిశి చెంచయ్య కుటుంబీకులు పేదల పక్షాన నిలబడి పోరాటం చేసి నీళ్లు ఇప్పించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

ముువ్వన్నెల జెండా భుజాన మోస్తూ..

- మహోన్నతుడు సయ్యద్‌షా మౌలానా మొహిద్దీన్ ఖాద్రీ బియాబాని



సయ్యద్‌షా మౌలానా మొహిద్దీన్ ఖాద్రీ బియాబాని (ఫైల్ ఫొటో)

స్వాతంత్య్ర ఉద్యమంలో సమరయోధులతో కలిసి పోరాటం చేసి ఎన్నో ఏళ్లు సార్లు జైలుకు వెళ్లారు. 500 ఎకరాల భూమిని ప్రభుత్వానికి విరాళం ఇచ్చిన మహోన్నత వ్యక్తి కంభంకు చెందిన సయ్యద్‌షా మౌలానా మొహిద్దీన్ ఖాద్రీ బియాబాని. అప్పటి కర్నూలు జిల్లా ప్రస్తుత ప్రకాశం జిల్లా అయిన కంభంలో 1894లో హజరత్ గౌస్‌పీరా ఖాద్రీ బియాబాని, తల్లి రుఖియాబి దంపతులకు ఆయన జన్మించారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో డిగ్రీ చదివారు. అనంతరం అలీఘర్ యూనివర్శిటీ నుంచి లో ఎల్ఎల్‌బీ పట్టా అందుకున్నారు. విద్యార్థి దశ నుంచే జాకీర్‌హుస్సేన్‌తో కలిసి స్వాతంత్రోద్యమంలో పాల్గొనేవారు.

1920లో జాతిపిత మహాత్మా గాంధీ విజయవాడ పర్యటన సమయంలో బియాబాని మహాత్మగాంధీని కలిశారు. ఆ తర్వాత 1923లో అఖిల భారత జాతీయ పతాక సత్యాగ్రహ ఉద్యమంలో ఆయన ముువ్వన్నెల జెండా భుజాన మోస్తూ పల్లెపల్లెకు తిరిగారు. స్వాతంత్య్ర పోరాట సమయంలో డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను రహస్యంగా కలుసుకున్నందుకు బ్రిటీషు ప్రభుత్వం ఆయన్ను జైల్లో పెట్టింది. కర్నూలులో స్వాతంత్ర పోరాటాన్ని ప్రారంభించి దేశవ్యాప్త ఉద్యమాల్లో ఆయన స్వాతంత్ర నినాదమై యువకులను ఉత్తేజపరిచేలా పోరాటం చేశారు. దీంతో బ్రిటీష్ ప్రభుత్వం ఆయన్ను అస్సాం రాష్ట్రంలోని గయా జైలులో పెట్టింది. అబుల్ కలాం ఉర్దూ భాషా ప్రావీణ్యం సహాయంతో ఆయన అరబ్బీ బాషలోని ఖురాన్‌లోని భాగాలను ఉర్దూ భాషలోకి అనువదించారు. ఆయన 11 భాషల్లో దిట్ట. స్వాతంత్య్రం అనంతరం మూడుసార్లు ఎమ్మెల్సీగా పనిచేశారు.

కలంతో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి..



ఓవీ రమణయ్య (ఫైల్)

ఉద్యమకారులకు మార్కాపురం పుట్టినిల్లు. మహాత్మాగాంధీ అడుగుజాడల్లో స్వాతంత్య్ర పోరాటంలో మార్కాపురానికి చెందిన ఓరుగంటి వెంకట రమణయ్య పాల్గొన్నారు. 1917జూలైలో జన్మించిన ఓరుగంట రమణయ్య 1932లో గాంధీజీ పిలుపు మేరకు విదేశీ వస్తు బహిష్కరణ, పికెటింగ్, సత్యాగ్రహ కార్యక్రమాల్లో పాల్గొని పశ్చిమ ప్రకాశంలో ముందుండి ఉద్యమాలను నడిపించారు. స్వరాజ్య సముపార్జనలో రాజకీయ పాఠశాలలో పాల్గొని దివంగత అయ్యదేవర కాళేశ్వరరావు, దేశభక్త కొండా వెంకటప్పయ్యల పిలుపు మేరకు ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారు. అప్పట్లో బ్రిటీష్ పోలీసులు రమణయ్య గృహాన్ని ఎన్నోసార్లు సోదాలు చేశారు. సుమారు 3 దశాబ్దాల పాటు పాత్రికేయునిగా పనిచేశారు. స్వాతంత్య్ర సమరం ఉవ్వెత్తున ఎగసి పడుతున్న రోజుల్లో ఆయన పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తూ పత్రికలకు వ్యాసాలు రాశారు. అప్పటి స్వాతంత్రోద్యమ పోరాటాలను బ్రిటీష్ పాలకుల దమననీతిని అక్రమ అరెస్టులను పత్రిక ద్వారా ప్రజలకు తెలియజేశారు. పత్రికలపై బ్రిటీష్ ప్రభుత్వం నిషేధం విధిస్తే ఆయన ధైర్యంగా మార్కాపురం, యర్రగొండపాలెం, దోర్నాల, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, గిద్దలూరు తదితర ప్రాంతాలకు పత్రికను పంపి స్వాతంత్య్రోద్యమ విశేషాలను వివరించారు. ఆయన జ్ఞాపకార్థం మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

అమరవీరుడు కాకుమాని



కాకుమాని వెంకటేశ్వర్లు(ఫైల్)

పీసీపల్లి మండలం పెదయిర్లపాడులో నిరుపేద ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించిన కాకుమాని వెంకటేశ్వరు గదర్ పార్టీ వ్యవస్థాపకులు దరిశి చెంచయ్యతో కలిసి ఉద్యమాల్లో పాల్గొన్నారు. భుక్తి కోసం, భూమికోసం, ప్రజల కోసం, మాతృదేశం కోసం అనే నినాదంతో దరిశి చెంచయ్య చేపట్టిన ఉద్యమ ప్రసంగాలకు కాకుమాని ఆకర్షితుడయ్యారు. దరిశి చెంచయ్య పిలుపుతో ఎన్నో ప్రజా ఉద్యమాలు చేశారు. అప్పట్లో కమ్యునిష్టు పార్టీ జాతీయ నాయకుడు, దివంగత మాజీ ఎంపీ గుజ్జుల యల్లమందారెడ్డి, కాకుమాని వెంకటేశ్వర్లు ఇద్దరు కలిసి దరిశి చెంచయ్యను పీసీపల్లి ప్రాంతానికి పిలిపించి సభ పెట్టించారు. అప్పటి బ్రిటిష్ పాలకులు కాకుమానిపై పలు కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత కమ్యునిష్టు పార్టీ ఉద్యమంలో గుజ్జుల యల్లమందారెడ్డితో కలిసి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన మరణానంతరం కమ్యూనిస్టు పార్టీ నాయకులు నేరేడు పల్లిలో 1989లో స్థూపాన్ని నిర్మించారు.

నాన్న ఆశయాలు కొనసాగిస్తా..

- ప్రజలకు అండగా ఉంటా
- బూచేపల్లి సుబ్బారెడ్డి జయంతి వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి
- కార్మికులు, సిబ్బందికి దుస్తుల పంపిణీ, అన్నదానం
- పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు



బూచేపల్లి సుబ్బారెడ్డి స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జున, నాయకులు

చీమకుర్తి: తన తండ్రి చూపిన బాటలో నడుస్తూ ఆయన ఆశయాలు కొనసాగిస్తానని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. తన తల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో పాటు వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, బూచేపల్లి కుటుంబ సభ్యులు, నాయకులతో కలిసి దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ తమ గ్రానైట్ క్వారీ అయిన సూర్య గ్రానైట్ క్వారీలో పనిచేసే కార్మికులు, సిబ్బందికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రతి సంవత్సరం తన తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి జయంతి, వర్ధంతి సందర్భంగా బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ తరఫున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. మేరుగు నాగార్జున మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి జయంతి సందర్భంగా బూచేపల్లి ట్రస్ట్ తరఫున సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. తొలుత పాటిమీదపాలెం రోడ్డులోని బూచేపల్లి పార్కులో బూచేపల్లి సుబ్బారెడ్డి స్మారకానికి నివాళులర్పించారు. అనంతరం బూచేపల్లి కళ్యాణ మండపం వద్ద ఉన్న బూచేపల్లి సుబ్బారెడ్డి విగ్రహానికి గజమాలలతో నివాళులర్పించారు. కళ్యాణ మండపంలో సూర్య గ్రానైట్ క్వారీలో పనిచేసే 500 మంది కార్మికులు, వర్కర్లు, బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో పనిచేసే సిబ్బందికి నూతన వస్త్రాలు అందించారు. అనంతరం 1500 మందికి అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాలలో బూచేపల్లి కుటుంబ సభ్యులతో పాటు చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్ బాబు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, పాటిబండ్ల గంగయ్య, కంజుల ప్రతాప్‌రెడ్డి, గోపురపు చంద్ర, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, మేకల యల్లయ్య, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, అవ్వారు ఆదినారాయణ, పులి వెంకటరెడ్డి, పాటిబండ్ల అశ్వద్ధామ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కొండపి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని పెద్దకండ్లగుంటలో గురువారం ఉదయం జరిగింది. ఎస్సై .ప్రేమ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని పెద్దకండ్లగుంట గ్రామానికి చెందిన దాసరి మహేంద్ర (20)ఒక టెంట్‌షాప్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి కూడా షాప్‌లో పనిచేశాడు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో పెద్దకండ్ల గుంటలోని జగనన్న కాలనీలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి మాల్యాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆదివారం రాత్రి మహేంద్ర సోదరి వివాహం జరగాల్సి ఉంది. మహేంద్ర మృతితో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

సిలిండర్ పేలి మామాకోడళ్లకు తీవ్రగాయాలు

ఒంగోలు టౌన్: గ్యాస్ సిలిండర్ పేలి మామాకోడళ్లకు తీవ్రగాయాలైన సంఘటన ఒంగోలు నగరంలోని సత్యనారాయణపురం కృష్ణ మందిరం వద్ద గల ఓ ఇంట్లో గురువారం ఉదయం జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న మేకపాటి మాల్యాద్రి కోడలు శిరీష (27) గురువారం ఉదయం నిద్రలేచి ఇంటిముందు ముగ్గు వేసింది. అనంతరం ఇళ్లు తుడిచేందుకు మొదటి అంతస్తులోకి వెళ్లింది. గ్యాస్ వాసన రావడంతో ఏంటో చూద్దామని లైట్ స్విచ్ వేసింది. దాంతో ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలిపోయి ఆ గదంతా మంటలు వ్యాపించాయి. మంటల్లో చిక్కుకున్న శిరిష.. భయంతో కాపాడండి అని కేకలు వేస్తూ పక్క గదిలో నిద్రిస్తున్న మాల్యాద్రి వద్దకు వెళ్లి పట్టుకుంది. ఆమె నుంచి విడిపించుకున్న మాల్యాద్రి వెంటనే పక్కనున్న నీటిని ఆమెపై పోసి మంటలను ఆర్పారు. అప్పటికే ఆమె పొట్ట, కాళ్లు కాలిపోయాయి. మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. అయితే, ప్రస్తుతం శిరీష పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. ఈ ప్రమాదంలో మాల్యాద్రికి రెండు చేతులు పూర్తిగా కాలిపోయాయి. ఆయనను స్థానికంగా ఓ ప్రైవేటు అస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. ఏడాది క్రితమే శిరీష ప్రేమ వివాహం చేసుకుంది. సంఘటనపై ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో క్షతగాత్రుడు

కంభం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. గజ్జల పెద్దపుల్లయ్య(50) భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి 7.45 నిమిషాల సమయంలో అనంతపురం– అమరావతి హైవే రోడ్డు పై వెళ్తుండగా స్థానిక మధుప్రియ రెస్టారెంట్ సమీపంలో బేస్తవారిపేట వైపు నుంచి కంభం వస్తున్న మినీ లారీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆలస్యంగా ఆస్పత్రికి తీసుకువెళ్లడంతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

చంద్రబాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ

దర్శి: ఇచ్చిన హామీలు వందశాతం అమలు చేసిన జగనన్నది ప్రజల మేనిఫెస్టో అని, 134 హామీలిచ్చి ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను మోసగించేందుకు ప్రవేశపెట్టిందే చంద్రబాబు మేనిఫెస్టో అని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బీ జాన్ వెస్లీ విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం జిల్లా స్థాయిలో క్రిస్టియన్ సెల్ నాయకుల పరిచయ కార్యక్రమంతో పాటు పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాన్ వెస్లీకి ముందుగా ఘనస్వాగతం పలికి దుశ్శాలువాలు, పూలమాలలతో జిల్లా నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ అనే కార్యక్రమాల ద్వారా చంద్రబాబు మోసాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయన్నారు. 2019–24 మధ్య వైఎస్సార్ సీపీ హయాంలో రూ.2.75 లక్షల కోట్ల విలువైన సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు అందించి ఐదేళ్లలో రూ.3.50 లక్షల కోట్లు అప్పు చేస్తే.. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో అప్పుడే రూ.1.90 లక్షల కోట్ల అప్పులు చేసి ఒక్క పథకం కూడా ప్రజలకు పూర్తిగా అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. ఆ డబ్బంతా ఎటు వైపు వెళ్లిందంటూ కూటమి పాలకులను ప్రశ్నించారు. కూటమి నాయకులు ప్రజల్లోకి వెళ్లాలంటే సమాధానం చెప్పలేక భయపడుతున్నారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు, ఉద్యోగాలు లేనివారికి రూ.3 వేల భృతి ఇవ్వకుండా నిరుద్యోగులను దారుణంగా మోసం చేశారన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారని, ఇప్పుడు మాత్రం ఆ ఒక్క హామీకే రాష్ట్రాన్ని అమ్మాలని అచ్చెన్నాయుడు అనడం ఏంటని నిలదీశారు. ఆ మాటతో చంద్రబాబు 45 ఏళ్ల రాజకీయ అనుభవం అవమానంపాలైందన్నారు. పొదిలి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో పర్యటించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణ చూసి చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌లకు నిద్రపట్టడం లేదన్నారు. నెలల తరబడి బెయిల్ రాకుండా వైఎస్సార్ సీపీ నేతలను జైళ్లలో ఉంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, క్రిస్టియన్‌సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుంటు పోలయ్య, దర్శి, కనిగిరి, యర్రగొండపాలెం, మార్కాపురం, ఎస్ఎన్ పాడు నియోజకవర్గాల అధ్యక్షులు గుంటూరు కృపానందం, గూడూరి అబ్రహాంలింకన్, సన్నెపోగు సుందరరాజు, ఉత్తమకుమార్, సుమన్, దర్శి, ముండ్లమూరు, కురిచేడు మండలాల క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు నగరికంటి ఏసన్న, రాచపూడి మిరియా, ముక్తిపూడి స్టాలిన్ పాల్, కురిచేడు, మార్కాపురం ఎస్సీ సెల్ అధ్యక్షులు కేసనపల్లి నాగేశ్వరరావు, బూదాల సతీష్, క్రిస్టియన్, పాలెపోగు డగ్లస్, సన్నీ బాబు, మోషె, బోయినపల్లి చిన్న ఏసోబు, టీ సుబ్బారావు, సుందరరావు, ఏసుదాసు, మిరియన్, ఏసన్న, చింతగుంట్ల తిమోతి పాల్గొన్నారు.

మసీదుకు నిప్పు పెట్టిన దుండగులు

– తగులబడిన జానిమాస్‌లు



మజీద్‌లో తగులబడిన జానిమాస్‌లు

యర్రగొండపాలెం: గుర్తు తెలియని దుండగులు జామియా మసీదుకు నిప్పు పెట్టిన సంఘటన త్రిపురాంతకం మండలంలోని దూపాడులో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగింది. ఆ మసీదు ఇమాం షేక్.ఇబ్రహీం కథనం ప్రకారం బుధవారం రాత్రి మసీదులో నమాజ్ చేసుకొని 9.30 గంటలకు తాళాలు వేసి ఇంటికి వెళ్లానని, మరుసటి రోజు గురువారం వేకువజామున నమాజ్ చేసుకోవటానికి మసీదు వద్దకు వెళ్లగా ప్రధాన ద్వారం తాళాలు పగులకొట్టి ఉందని, లోపల నమాజ్ చేసుకొనే జానిమాస్‌లు తగులబడి పోయాయని ఆయన తెలిపారు. వెంటనే ఈ విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో త్రిపురాంతకం సీఐ హసాన్, ఎస్సై శివ బసవరాజు హుటాహుటిన దూపాడులోని మసీదును పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ముమ్మరంగా దర్యాప్తు ప్రారంభించారు. పోలీసు జాగిలం మసీదు పరిసర ప్రాంతాల నుంచి నేరుగా సమీపంలో ఉన్న గుంటూరు–కర్నూలు హైవేరోడ్‌లో ఉన్న బస్టాండ్ వరకు వెళ్లింది. దుండగులు అక్కడి నుంచి బస్సు, లేకుంటే తమ వెంట తెచ్చుకున్న వాహనంలో వెళ్లి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించారు. ఈ సంఘటనకు కారకులైన వారిని వెంటనే పట్టుకొని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

మసీదులో జానిమాస్‌లు తగులబెట్టడం దారుణం

మసీదులో నమాజ్ చేసుకునే జానిమాస్‌లు తగులబెట్టడం దారుణమైన సంఘటన అని కర్నూలు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకుడు పఠాన్ హఫీజ్ ఖాన్ 'సాక్షి'తో అన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రశాంతంగా జీవనం సాగిస్తున్న దూపాడు ప్రాంతంలో అశాంతిని నెలకొల్పేందుకు దుండగులు చేసిన దారుణ చర్య సహించరానిదని, ఈ చర్యకు పాల్పడిన నిందితుడిని పట్టుకొని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కూలిన మట్టి మిద్దె

రాచర్ల: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మట్టి మిద్దె పైకప్పు కూలింది. ఈ సంఘటన మండల కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. వెల్పుల పెద్ద రాజయ్య గృహంలో అదే గ్రామానికి చెందిన మడ్లా చిన్నపుల్లయ్య మూడేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. వర్షాలకు పైకప్పు కారుతూ రాత్రి 9:30 గంటలకు కూలిపోయింది. మిద్దె కూలిన సమయంలో మడ్లా చిన్నపుల్లయ్య, భార్య సుహాసినితో పాటు ఇద్దరు పిల్లలు బయట వరండాలో నిద్రిస్తున్న సమయంలో ఎలాంటి ప్రాణనష్టం కలగలేదని తెలిపారు. ప్రమాదంలో సామగ్రి ధ్వంసమై రూ.లక్ష నష్టం వాటిల్లింది. తహసీల్దార్ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.